క్లుప్తంగా

కాన్షీరాం కుటుంబ సభ్యులకు ఆహ్వానం



విగ్రహావిష్కరణకు ఆహ్వానిస్తున్న సురేందర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో మార్చి 4న మాన్య వార్ కాన్షీరాం విగ్రహావిష్కరణకు రావాల్సిందిగా కాన్షీరాం సోదరి, కాన్షీరాం ఫౌండేషన్ చైర్మన్ స్వరణ్‌కౌర్ తో పాటు వారి కుటుంబీకులను ఆహ్వానించినట్లు ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్నీ తెలిపారు. పెద్దపల్లి జెండా కూడలిలో ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ పోస్టర్‌ను వారి చేతులమీదుగా ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాన్షీరాం మేనల్లుడు రవీందర్‌సింగ్, సాతూరి అనిల్ తదితరులున్నారు.

విద్యార్థులకు విజ్ఞాన, విహార యాత్ర



పేపర్ తయారీ కేంద్రం వద్ద విద్యార్థులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజ్ఞాన విహారయాత్రలో భాగంగా శనివారం కరీంనగర్ జిల్లా దుర్శేడ్‌లోని గాంధీ పేపర్ తయారీ కేంద్రం, కరీంనగర్ డెయిరీలను పరిశీలించారు. పేపర్ తయారీ విధానం తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు బాలకృష్ణ, రాజేందర్, ఉపాధ్యాయులు కిషన్, సుచేత, స్వప్న, సత్తయ్య, రమేష్, సాయిలు తదితరులున్నారు.

పోస్టాఫీస్‌ను సందర్శించిన విద్యార్థులు



వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

సుల్తానాబాద్: పట్టణంలోని పోస్టాఫీస్ బ్రాంచ్ కేంద్రాన్ని విద్యార్థులు సందర్శించారు. శనివారం వివేకానంద పాఠశాల విద్యార్థులు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ గణేశ్ పోస్టల్ శాఖలో ఉన్న పథకాల గురించి వివరించారు. విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వివేకానంద పాఠశాల డైరెక్టర్ భూసారపు రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన ఉండాలనే పోస్టాఫీస్ ను సందర్శించి సేవలను విద్యార్థులకు వివరించామన్నారు. జాతీయ పొదుపు రికవరీ డిపాజిట్ ఖాతా ఈ పథకాలు చిన్న, పెద్ద పెట్టుబడిదారులకు అవసరం తీర్చడానికి రూపొందించడానికి సహాయపడుతుందని తెలిపారు. వివిధ సేవింగ్స్ స్కీంలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి ఉపాధ్యాయురాలు రజిని పోస్టాఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధూళికట్టలో రేణుకా ఎల్లమ్మ జోగు



జోగెత్తుతున్న గౌడ కులస్తులు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో శ్రీరేణుక-ఎల్లమ్మ పట్నాల ఉత్సవాల్లో భాగంగా శనివారం జోగెత్తడం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుక-ఎల్లమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని డప్పు, చప్పుళ్లతో ఇంటింటికీ తిప్పుతూ జోగెత్తారు. ఆదివారం పోచమ్మ బోనాలు, ఈనెల14న ఎల్లమ్మ బోనాలు, 15న ఎల్లమ్మ లగ్నపట్నం, 16న నాగవెల్లి పట్నం వంటి కార్యక్రమాలు జరుగుతాయని ఆ సంఘం అధ్యక్షుడు భూసారపు నర్సయ్యగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పూదరి వెంకటేశంగౌడ్, రంగు కొమురయ్య గౌడ్, కొయ్యెడ నర్సయ్యగౌడ్, సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం తొగర్రాయిలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి కేసీఆర్ సేవా దళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్ శనివారం రూ.25.116లను అందించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ విద్యార్థి సంఘం నాయకుడు పిట్టల రమేష్, సేవా దళం జిల్లా అధ్యక్షుడు దండే వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కాంతయ్య,నాయకులున్నారు.



ఒరిస్సా కోణార్క్ ఫెస్టివల్‌లో శంకర్ రూపొందించిన సైకత-శిల్పం

భక్త రామదాసు సైకత శిల్పాన్ని తయారుచేస్తున్న శంకర్

సైకత కళ.. C/o రేవెల్లి

- అంతర్జాతీయ స్థాయిలో రాణింపు
- ఇసుకతో విభిన్న రూపాలు
- వందకుపైగా సైకత చిత్రాల రూపకర్త

పాలకుర్తి: కళ అనేది మనలో దాగివున్న నైపుణ్యాన్ని బయటి ప్రపంచానికి తెలియజేస్తుంది. అయితే అందరిలా కాకుండా తమకంటూ ఓ ప్రత్యేకత ఉండాలనే లక్ష్యంతో ముందుకు సాగేవారు కొందరుంటారు. సరిగ్గా అలాంటి కోవకే చెందిన వ్యక్తి పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూర్ గ్రామానికి చెందిన రేవెల్లి శంకర్. ఇసుకతో విభిన్న రకాల శిల్పాలు తయారు చేస్తూ జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న శంకర్

అందరిలో భిన్నంగా ఉండాలనే..



చిన్నప్పటి నుంచి బొమ్మలు గీయడం అంటే ఎంతో ఇష్టం. అయితే అందరిలో భిన్నంగా ఉండాలనే కాంక్షతో ఇసుకతో బొమ్మలను రూపొందించడం నేర్చుకున్నాను.ప్రస్తుతం నా సొంత ఖర్చులతోనే వివిధ పోటీలలో పాల్గొంటూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి సహకారం అందిస్తే భవిష్యత్‌లో మరిన్ని వైవిధ్యభరితమైన కళాకృతులతో రాణించి రాష్ట్రానికి పేరు తీసుకువస్తాను.

-రేవెల్లి శంకర్, కళాకారుడు

ఇసుకలో కట్టిన పిట్టగూళ్లే స్ఫూర్తిగా...

కుక్కలగూడూర్ గ్రామానికి చెందిన రేవెల్లి అనసూర్య- మల్లేశం దంపతులకు ఇద్దరు కుమారులు,ముగ్గురు కూతుళ్లు కాగా వారిలో శంకర్ రెండో వాడు. శంకర్ చిన్నతనం నుంచే బొమ్మలు గీయడమంటే ఎంతో ఆసక్తి. చదువుకునే వయసులో వాగులో స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లినప్పుడు ఇసుకలో కట్టిన పిట్టగూళ్లు, బొమ్మరిల్లను స్ఫూర్తిగా తీసుకుని ఇసుకలో బొమ్మలు గీయడం నేర్చుకున్నాడు. ఇసుకతో మొదటగా గ్రామంలో చిన్న,చిన్న బొమ్మలను తయారుచేసిన శంకర్ 2013లో తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయానికి ప్రతీకైన 'బతుకమ్మ' చిత్రాన్ని తయారుచేశాడు. ఆ చిత్రాన్ని చూసిన స్థానికులు శంకర్ కళా నైపుణ్యాన్ని మెచ్చుకుని ప్రశంసించారు. అదే స్ఫూర్తితో శంకర్ తన సైకత కళను బాహ్య ప్రపంచానికి తెలియజేశాడు. దాదాపు పదేళ్లుగా సైకత కళలో రాణిస్తున్న శంకర్ రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు వెళ్లి తన కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందుతున్నాడు.

సండే స్పెషల్

100కు పైగా ప్రతిమలు

ఇప్పటివరకు శంకర్ దాదాపు 100కు పైగా సైకత శిల్పాలను తయారుచేశారు. మహానేతలు, ప్రముఖులు, రాజకీయ నాయకుల జన్మదినాల సందర్భంగా వారి శిల్పాలతో పాటు ప్రస్తుత ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన లోగోలు సైతం ఇసుకతో తయారుచేసి తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ సమాజహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడు శంకర్. 2017లో హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల లోగోను ఇసుకతో తయారు చేసి ప్రభుత్వ సలహాదారులు రమణాచారి చేతుల మీదుగా రూ.5 వేల నగదు పురస్కారాన్ని అందుకున్నాడు.

- భద్రాచలంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా శ్రీరాముడి సైకతాన్ని తయారు చేసి అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా సన్మానం పొందారు.
- గతేడాది ఒరిస్సాలోని చంద్రభాగ నదీతీరాన నిర్వహించిన ఇంటర్నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్‌లో పాల్గొన్న శంకర్ బతుకమ్మ చిత్రాన్ని వేసి రెండో బహుమతి సాధించాడు. అంతర్జాతీయ కళాకారుడు, పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లోని పుడమి సాహితీ వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ ఆణిముత్యం–2022 అవార్డు అందజేశారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హోమం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం హోమయజ్ఞం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాష్యం రంగాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హోమ యజ్ఞంలో ఆలయకమిటీ చైర్మన్ బొంకూరి శంకర్ తో పాటు పెద్దపల్లి, రంగంపల్లి, పెద్దకల్వల, పెద్దబొంకూర్ తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయని అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు



స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎలిగేడు: కరీంనగర్ స్థానికసంస్థల ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాదరావును తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం రాత్రి ఎలిగేడు మండలం ధూళికట్టలో రైతుసమన్వయ సమితి మండల కన్వీనర్ నరినేని సుధాకర్‌రావు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా టపాసులు పేల్చి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముప్పిరితోట సర్పంచ్ పెద్దోళ్ల ఐలయ్య, నాయకుల పాల్గొన్నారు.

'పేరెంట్స్‌డే' వేడుకలు

పాలకుర్తి: మండలంలోని ఘన శ్యాందాస్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని యూనివర్సల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం పేరెంట్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం.ఇస్మాయిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో పిచ్చికుక్కల సంచారం

- భయాందోళనలో ప్రయాణికులు
- వాల్వ్ చెడిపోవడంతో వృథాగా పోతున్న తాగునీరు
- ప్లాట్‌ఫారంపై రైల్వే అధికారుల పర్యవేక్షణ లోపం



ప్లాట్‌ఫారంపై సంచరిస్తున్న పిచ్చికుక్కలు



వృథాగా పోతున్న తాగునీరు

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం పిచ్చికుక్కలకు ఆవాసంగా మారిందని చెప్పవచ్చు. ఇటీవల రైల్వేస్టేషన్‌లో అనారోగ్యం, మచ్చలతో పూర్తిగా ఈగలు వాలుతూ ఉన్న పిచ్చికుక్కలు సంచరిస్తుండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ప్రయాణికుల బ్యాగులను మూతితో నాకుతూ ప్రయాణికులను వెంబడిస్తున్నాయి. రెండో నెంబర్ ప్లాట్‌ఫారంపై తాగునీటి కులాయి వాల్వ్ చెడి పోవడంతో 24 గంటల పాటు నీరు వృథాగా పోతుంది. రెండో నెంబర్ ప్లాట్‌ఫారంపై వైపు తరచూ లిఫ్ట్ మొరాయించడంతో వికలాంగులు మెట్లు ఎక్కలేక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు ప్లాట్‌ఫారంపై పర్యవేక్షణ లోపం స్పష్టం కనిపిస్తుందని ప్రయాణికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత రైల్వే ఉన్నతాధికారులు స్పందించి కులాయిని పునరుద్ధరించి వృథా నీటిని అరికట్టి, ప్లాట్‌ఫారంపై పిచ్చికుక్కల బెడదను తీర్చి ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

పాదయాత్ర జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్: ఈనెల 12 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యం రావు కోరారు. శనివారం కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను వీడాలని, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా నుంచి సీఐటీయూ నాయకులు గ్రామపంచాయతీ సిబ్బంది అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు కలవేన గట్టయ్య, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి దొడ్ల రాజబాబు, సీఐటీయూ నాయకులు మహేశ్, మెట్టు లక్ష్మణ్, గాసోద్దీన్, ఖాజా, మహేశ్, సుజాత పాల్గొన్నారు.

'ఇచ్చిన హామీలు అమలు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: ప్రజా స్పందన ఓర్వలేకే విమర్శలకు దిగుతున్నారని కాంగ్రెస్ పార్టీ రామగుండం కార్పొరేషన్ బీసీసెల్ అధ్యక్షుడు గట్ల రమేష్, కార్పొరేటర్ ముస్తాఫా అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర స్ఫూర్తి సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరవేసే లక్ష్యంతో హాత్ సే హాత్ జోడో యాత్ర గడిచిన 5 రోజులుగా కార్పొరేషన్‌లో 10 డివిజన్లలో పాదయాత్ర విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. చేతనైతే ఈప్రాంతంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓసీపీ బ్లాస్టింగ్ దుమ్ముతో ప్రజలు రోగాల భారిన పడుతున్నా నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. ఎస్టీపీపీ లేక డ్రైనేజీ నీరు, పరిశ్రమల వ్యర్థాలు నేరుగా గోదావరిలో కలుస్తున్నాయన్నారు. ఈవిషయంలో జోక్యం చేసుకుని స్వచ్ఛమైన నీరు ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రవి, యుగేందర్, శ్రీను, సతీష్, వినోద్, సత్య ప్రసాద్, వుసాలశ్రీను, కిరణ్‌కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్, నాయకులు

మంథని: ఈ నెల 20న పుట్టలింగమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంథనిలోని ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో నిర్వహించే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు కోరారు. శనివారం మంథనిలోని తన నివాసంలో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంథని నుంచి హైదరాబాద్ వరకు ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా 40 కంపెనీల సహకారంతో మేళాను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజల ఓట్లతో అనేక పదవులు పొందిన ఎమ్మెల్యే ఏనాడు ఒక్క పైసా ఖర్చు చేసి సేవ చేయలేదన్నారు. ఉచితంగా వచ్చే సేవలనే ప్రచారం చేసుకుంటున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగవుతాయి

ఓదెల: క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగవుతాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ క్రికెట్ కప్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ గ్రామీణ క్రీడలను ప్రోత్సాహించడానికి క్రీడాకారులకు అండగా ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మ్యాడగొని శ్రీకాంత్‌గౌడ్ , ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జూలపల్లి: సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి కవిత తెలిపారు. మార్చి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 23 జిల్లా కేంద్రాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

ముందస్తు అరెస్టు

సుల్తానాబాద్‌రూరల్:ఎస్సీ జాబితాలో ఒడ్డెరలను చేర్చాలని డిమాండ్ చేస్తూ శనివారం అసెంబ్లీ ఎదుట ధర్నా నిర్వహిస్తారనే సమాచారం మేరకు నాయకులను శనివారం సుల్తానాబాద్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో శ్రీనివాస్, హెస్సెన్, పోచయ్య, సురేందర్ ఉన్నారు

కాంగ్రెస్ గ్రామ కమిటీ నియామకం

రామగిరి: ముత్తారం మండలం పోతారం గ్రామ కాంగ్రెస్ కమిటీని శనివారం నియమించారు. అధ్యక్షుడిగా నర్ర మల్లయ్య, ఉపాధ్యక్షులుగా చింతల అనిల్, బత్తుల మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా వెల్కల కిషన్, కార్యదర్శిగా ఆడిచర్ల రాజయ్య, కోశాధికారిగా నాంసాని రమేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నెత్తెట్ల కిరణ్, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా బత్తుల రాజయ్య, బీసీ సెల్ అధ్యక్షుడిగా గాడిచర్ల శంకర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బండ సమ్మయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నెత్తెట్ల ప్రవీణ్ కుమార్‌ను ఏకగ్రీవంగా నియమించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొడ్డ బాలజీ, జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బియ్యని శివకుమార్, ఉపాధ్యక్షుడు గాదం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హిందూ వాహిని మండల అధ్యక్షుడిగా కుమార్

ఓదెల: మండలంలోని హిందూ వాహిని అధ్యక్షుడిగా శాతల్ల కుమార్ ఎన్నికైనట్లు రాష్ట్ర కమిటీ సభ్యులు రాజు పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా మేకల అనిల్, గొర్ల సాయి, మేకల రవి, కమిటీ సభ్యులుగా రామగిరి కృష్ణ, సురేశ్, వంశీ, శ్రీకాంత్, హరీశ్ రాజు, నాగరాజు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

సమాచారం

నేడు నాగేపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

రామగిరి: మండలంలోని నాగేపల్లిలో కియా హాస్పిటల్ ఆధ్వర్యంలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామానికి చెందిన వైద్యుడు డాక్టర్ అనిల్ కుమార్ ముప్పిడి తెలిపారు. తన నానమ్మ, తాత ముప్పిడి రాజమ్మ, కిష్టయ్య జ్ఞాపకార్థం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉదయం 10గంటలకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వైద్య శిబిరంలో ప్రముఖ స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ గ్రీష్మిక ముప్పిడి, ఎముకల వైద్యనిపుణురాలు డాక్టర్ కీర్తన పుల్లెల, ఎమర్జెన్సీ ఫిజిషియన్లు డాక్టర్ అనిల్ కుమార్ ముప్పిడి, డాక్టర్ రాజేంద్రప్రసాద్ పుల్లెల, ఛాతి వైద్యులు డాక్టర్ రవీంద్రా చారి, చెవి, ముక్కు, గొంతు వైద్యులు డాక్టర్ శేఖర్, దంత వైద్యులు డాక్టర్ నిషాంత్ పాల్గొంటున్నట్లు ఆయన వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని నిమ్మనపల్లి, నిట్టూరు, పెద్దకల్వల, పెద్దబొంకూర్‌తో పాటు పట్టణంలోని రంగంపల్లి, భూంనగర్, కూనారంరోడ్, చీకురాయిరోడ్, మేన్‌రోడ్, కమాన్‌రోడ్, సుభాష్‌నగర్, ప్రభుత్వాసుపత్రి ఏరియా, ఉదయ్‌నగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సత్యనారాయణ తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రినిటీలో కెరీర్ ఇన్‌కామర్స్



మాట్లాడుతున్న సతీశ్ కుమార్

పెద్దపల్లిరూరల్: ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత తరుణంలో పోటీ నెలకొందని, యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే ముందుకు సాగుతారని అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీశ్ కుమార్ అన్నారు. పెద్దపల్లిలోని ట్రినిటీ డిగ్రీ, పీజీ కాలేజీలో శనివారం కెరీర్ ఇన్ కామర్స్ ఎ సెషన్ కార్యక్రమం నిర్వహించారు. గిగ్ ఎకానమీ విస్తరణ, వాణిజ్య స్ట్రీమ్ అభ్యసిస్తున్న వారికి ఈ కోర్సు పాస్‌పోర్టు టు కార్పొరేట్ కంపెనీస్ అని వివరించారు. విద్యార్థులు పరిశోధనపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, వైస్‌ప్రిన్సిపాల్ సీతూరెడ్డి, అధ్యాపకులు రమణారెడ్డి, సంజీవరెడ్డి, బాబు, సరత, సంతోశ్ తదితరులున్నారు.